కొనసాగుతున్న నవరాత్రోత్సవాలు

జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాలు, పట్టణాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాల వద్ద శనివారం మహిళలు కుంకుమ పూజ చేశారు. పలు మండపాల వద్ద దాతల సాయంతో ఉత్సవ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

- సాక్షి, నెట్‌వర్క్



స్టేషన్‌ఘన్‌పూర్: పూజ చేస్తున్న అధికారులు, భక్తులు



బచ్చన్నపేటలో..



చిల్పూరు: పూజ చేస్తున్న భక్తులు



రఘునాథపల్లి: మహాదేవస్వామి ఆలయంలో చీరలు అందజేస్తున్న చైర్మన్ ఉపేందర్ దంపతులు

క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరిక

పాలకుర్తి: మండలంలోని ఈరవెన్ను నుంచి 20 మంది కాంగ్రెస్ కార్యకర్తలు చాకలి ఐలమ్మ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముస్కు రాంబాబు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కాగా, శనివారం వారికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఎర్రబెల్లి నామినేషన్‌కు విరాళం

దేవరుప్పుల: పాలకుర్తి అసెంబ్లీ ఎమ్మెల్యేగా బరిలో నిలిచేందుకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు కడవెండికి చెందిన గుముడవెల్లి రాజకుమారి –సోమేష్ దంపతులు నగదు విరాళం అందించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కడవెండిలో సంస్కార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తలపెట్టిన దేవీశరన్నవరాత్రోత్సవాల్లో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆమె పిలుపుమేరకు ఇంటికెళ్లగా మంగళహారతులతో ఆశీస్సులు అందించి విరాళం అందించడంతో మంత్రి ముగ్ధులయ్యారు. హన్మంతు, మహేష్, సోమసుందర్ తదితరులు ఉన్నారు.

'విశ్వకర్మ యోజన'ను వినియోగించుకోవాలి

నర్మెట: దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన ప్రథకాన్ని అర్హులు వినియోగించుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు ధరావత్ రాజునాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విశ్వకర్మ యోజన బంధు నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. నాయకులు అనిల్ కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ లేని ఉప్పుతో ఆరోగ్యానికి ముప్పు



స్టేషన్‌ఘన్‌పూర్: ప్రజలు సాధారణంగా రోజూ వినియోగించే ఉప్పులో అయోడిన్ తగిన మోతాదులో ఉండాలి.. లేదంటే ఆరోగ్యానికి హానికరమని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఆర్.సుధీర్ అన్నారు. శనివారం ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప్పులో అయోడిన్ లేకుంటే థైరాయిడ్ వ్యాధి వచ్చే అవకాశం ఉందని, ముఖ్యంగా మహిళలతోపాటు గర్భిణులు, పిల్లలు, వృద్ధులకు సమస్యలు ఎదురవుతాయని చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మానస, డాక్టర్ ప్రసన్నకృష్ణ, డాక్టర్ అజయ్, సీహెచ్‌ఓ సాంబయ్య, వెంకటేశ్వర్లు, స్టాఫ్ నర్సు స్వర్ణ పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

తరిగొప్పుల: తనిఖీల్లో 27 లీటర్ల గుడుంబా పట్టుబడగా, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపారు. మండలంలోని బొత్తలపర్రె శివారులో శనివారం వాహన తనిఖీలు చేపట్టగా బొత్తలపర్రె శివారు వాంకుడోత్ తండాకు చెందిన వాంకుడోత్ తిరుపతి, వాంకుడోత్ మంజుల, చిల్పూర్ మండలం ఫతేపూర్ గ్రామానికి చెందిన గుగులోత్ ప్రవీణ్ ద్విచక్రవాహనంపై ప్లాస్టిక్ బాటిళ్లలో గుడుంబాను చిల్పూర్ మండలం శ్రీపతిపల్లికి తరలిస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. వారి నుంచి 2.25 లీటర్ల సామర్థ్యంగల 12 ప్లాస్టిక్ బాటిళ్ల గుడుంబా, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకొని సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రజల్లో మార్పు వచ్చేలా సినిమాలు తీయాలి



చిల్పూరు: ప్రజల్లో మార్పు వచ్చేలా షార్ట్ ఫిల్మ్‌లు తీయాలని, అప్పుడే సమాజంలో నూతన నటీ నటులకు గుర్తింపు వస్తుందని ఎస్సై బొల్లం వినయ్‌కుమార్ అన్నారు. మల్కాపూర్‌లో ఆర్ట్ ప్రొడక్షన్–1 కర్త పేరుతో సినిమా షూటింగ్‌ను శనివారం ఎస్సై , సర్పంచ్ కొంగరి రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జీవన్ మాట్లాడుతూ తాము నిర్మించే సినిమా పూర్తిగా గ్రామీణ ప్రాంతానికి చెందినదని అన్నారు. 20 రోజుల పాటు ఇక్కడ షూటింగ్ నిర్వహిస్తామన్నారు. ప్రొడ్యూసర్ సల్వాం, హీరో హరీష్‌వినయ్, హీరోయిన్‌లు మునిశ్రీ, శ్రీవాణిగోపీచంద్, సర్పంచ్ పాత్రలో చీకట్ల రాజు, అనిల్, గద్దం రాజు, వైజాగ్ శ్రీను, సంగాల్ డింగాల్ కేజీఎఫ్, మేకప్ బోగం లావణ్య, నమాల రమేష్, అశోక్ పాల్గొన్నారు.

ఎన్నిక

నర్మెట: తెలంగాణ రాష్ట్ర శాలివాహన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని హన్మంతాపూర్ గ్రామానికి చెందిన రాయారపు ఉపేందర్‌ను ఎన్నుకున్నట్లు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకారపు మోహన్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికైన ఉపేందర్ మాట్లాడుతూ శాలివాహన సంఘం నాయకులను అందరిని ఒక తాటిపైకి తీసుకవచ్చి సంఘ బలోపేతానికి పాటుపడతానని అన్నారు.

'సద్దుల బతుకమ్మ'కు ఏర్పాట్లు పూర్తి



రఘునాథపల్లి: నిమజ్జనానికి నీటి కుంటను ఏర్పాటు చేయిస్తున్న సర్పంచ్



లింగాలఘణపురం: సద్దుల బతుకమ్మ వేడుకలకు పోచమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని విజయదుర్గాదేవి ఆలయం వద్ద సద్దుల బతుకమ్మ వేడుకల నిర్వహణకు శనివారం ఏర్పాట్లు పూర్తి చేశారు. సర్పంచ్ పోకల శివకుమార్ డోజర్‌తో బతుకమ్మలు ఆడేందుకు చదును చేయించారు. బతుకమ్మల నిమజ్జనానికి ప్రత్యేక నీటి కుంటను ఏర్పాటు చేశారు. బస్టాండ్ నుంచి ఆలయం వరకు లైటింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు.

లింగాలఘణపురం: సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లోని చెరువులు, కుంటల వద్ద శనివారం ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యుత్ వెలుగులతో పాటు మహిళలు బతుకమ్మ ఆడుకొనేందుకు వీలుగా అంతా చదును చేశారు. అన్ని గ్రామాల చెరువుల్లో నీరు నిండి ఉండడంతో నిమజ్జనం చేసేందుకు తగిన ఏర్పాట్లను చేశారు. మండల కేంద్రంలో పోచమ్మ గుడి వద్ద సర్పంచ్ విజయ్‌మనోహర్, ఎంపీటీసీ భిక్షపతి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌లు విద్యుత్ వెలుగు ఏర్పాట్లు చేశారు.

ప్రజల పక్షాన పోరాడేది ఎర్రజెండా

రఘునాథపల్లి: అనునిత్యం సమస్యల పరిష్కారం కోసం ప్రజల పక్షాన పోరాడేది ఎర్రజెండా అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మైలారం వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం, రాష్ట్రంలో ప్రజా ఉద్యమాలే ఊపిరిగా ప్రజల కోసం అనునిత్యం ఉద్యమాలు నిర్వహిస్తుంది సీపీఎం అన్నారు. పాలకవర్గాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు చేపడుతుందన్నారు. మండలంలో సీపీఎం బలోపేతానికి అవిశ్రాంతిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పొదల నాగరాజు, మండల కార్యదర్శి గంగాపురం మహేందర్, కడారి ఐలయ్య, కాసాని పుల్లయ్య, కడారి ఆంజనేయులు, ఇంజ వెంకటస్వామి, గొలనుకొండ చక్రపాణి, భిక్షపతి, రాము, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో కాంగ్రెస్ గెలుపు ఖాయం



స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న శిరీష్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: రానున్న సాధారణ ఎన్నికల్లో ఘన్‌పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సింగపురం ఇందిర భారీ మెజార్టీతో గెలుపు సాధించడం తథ్యమని పార్టీ ఘన్‌పూర్ మండల శాఖ అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలోని పార్టీకార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఘన్‌పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి గ్రూపులు లేవని, అందరూ ఐక్యంగా పార్టీ గెలుపే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు శివకుమార్, కొళ్ల రవిగౌడ్, నూకల ఐలయ్య, సురేష్, రాంచందర్, కృష్ణ పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

లింగాలఘణపురం: మండలంలోని కాంగ్రెస్ నాయకులు నిఖార్సయిన వారని, సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నారని, వారు ఎలాంటి ప్రలోభాలకు లొంగరని, రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దిలీప్‌రెడ్డి అన్నారు. మండలంలోని వడిచర్లలో గడపగడపకూ కాంగ్రెస్ నినాదంతో ఆరు గ్యారంటీ స్కీంలను పార్టీ మండల అధ్యక్షులు కొల్లూరి శివకుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో దిలీప్‌రెడ్డి మాట్లాడారు. తాము చేసిన అభివృద్ధిపై నమ్మకం లేక ఓడిపోతామనే భయంతో కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను ప్రలోభ పెట్టేందుకు ఫోన్లు చేస్తూ డబ్బులు ఇస్తాం.. మా పార్టీలో చేరండి అంటూ అధికార పార్టీ ఓ యువ నాయకుడు రాజకీయ వ్యభిచారం చేస్తున్నారని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దిలీప్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. గ్రామశాఖ అధ్యక్షుడు పరశురాములు, ఉపసర్పంచ్ వెంకటేష్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అనిల్, మండల అధ్యక్షుడు సంపత్, కుమార్, రాజు, నర్సింహులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం..

జఫర్‌గఢ్: తమ్మడపల్లి (ఐ)లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు రడపాక డానియల్, నాయకులు పరుశరాములు, రాజశేఖర్, బాబు, సాయి, రమేష్, రాజు ఉన్నారు.

దేవరుప్పుల: ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటం కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమని యూత్ కాంగ్రెస్ మండల ప్రతినిధి ఉప్పుల అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని నల్లకుంట, ధారావత్‌తండాలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీ సంక్షేమ పథకాలపై ప్రచారం నిర్వహించారు.

ఆరు గ్యారంటీలకు విశేష స్పందన

కొడకండ్ల: పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ మేనిఫెస్టోలో రూపొందించిన ఆరు గ్యారంటీ పథకాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని పాలకుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ రాజేష్‌నాయక్ అన్నారు. నక్క సారయ్య ఆధ్వర్యంలో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా రామవరంలో ఆరు గ్యారంటీలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నక్క యాకస్వామి, మండల ఉపాధ్యక్షుడు మహేందర్, యూత్ అధ్యక్షుడు యాకన్న, బుచ్చమ్మ, సరిత, మల్లేష్ పాల్గొన్నారు.

పోలీసుల త్యాగం వెలకట్టలేనిది



రఘునాథపల్లి: శాంతియుత సమాజ నిర్మాణం కోసం.. విధి నిర్వహణలో ప్రాణాలను పణంగా పెట్టి అమరులైన పోలీసుల త్యాగం వెలకట్టలేనిదని వెస్ట్‌జోన్ డీసీపీ సీతారాం అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో అమర వీరుల స్మారక స్థూపం వద్ద ఏసీపీ, సీఐ, ఎస్సైలతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ సమాజ రక్షణలో రాత్రింబవళ్లు కుటుంబాలకు దూరంగా ఉంటూ విధినిర్వహణలో అసువులు బాసిన పోలీసుల త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి సవాళ్లు ఎదురైనా కలిసికట్టుగా ఎదుర్కోవాలని, ఒత్తిడికి గురి కాకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీలు శ్రీనివాస్‌రావు, రఘుచందర్, దేవేందర్‌రెడ్డి, సీఐలు ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, నట్ల రాజు, సాయి రమణ, ఎస్సైలు చాగర్ల రఘుపతి, వినయ్‌కుమార్, నాగరాజు, మహేందర్, సృజన్, ఏఎస్సైలు, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

పోలీస్ అమరులకు నివాళి

నర్మెట: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా శనివారం సాయంత్రం పోలీసు ఠాణానుంచి సీఐ మినుకూరి సాయిరమణ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ప్రజలు చౌరస్తాలోని అమరవీరుల స్తూపంవద్ద ఘనంగా నివాళులర్పించారు. నర్మెట, తరిగొప్పుల, బచ్చన్నపేట ఎస్సైలు కన్నెబోయిన శ్రీకాంత్, దూదిమెట్ల నరేష్, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలు

జనగామ రూరల్: బతుకమ్మ పండుగ పురస్కరించుకొని శనివారం పట్టణంలోని ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్రీతేజ మాట్లాడుతూ ప్రకృతినికొలిచే బతుకమ్మ పండుగ చిన్నాపెద్ద తేడా లేకుండా అందరు కలిసి ఆడే పండుగ అన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



బచ్చన్నపేట: ఆర్థికసాయం అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి

బచ్చన్నపేట: నాగిరెడ్డిపల్లికి చెందిన మంతపురి ప్రభాకర్ ఇటీవల మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పరామర్శించి రూ.20 వేల ఆర్థికసాయం శనివారం అందజేశారు. కిసాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ నిడిగొండ శ్రీనివాస్, నాయకులు నల్లగోని బాలకిషన్‌గౌడ్, దిడ్డిగ రమేష్, మోహిన్‌రెడ్డి, శ్రీనివాస్, రాములు, ప్రభాకర్, సుధాకర్, బాలయ్య, మల్లయ్య పలువురు పాల్గొన్నారు.

పరామర్శ

నర్మెట: గండిరామారానికి చెందిన నీల అజయ్ విద్యుదాఘాతంతో శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. కాగా, విషయం తెలుసుకున్న జనగామ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి సూచనలతో శనివారం పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చింతకింది సురేష్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గద్దల నర్సింగారావు, ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, జెడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్, జెడ్పీ కోఆప్షన్ ఎండీ గౌస్, పార్టీ కోఆర్డినేటర్ నీరటి సుధాకర్, ప్రధాన కార్యదర్శి కంతి రాజలింగం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

మహిళా రిజర్వేషన్ అమలు చేయాలి



వేడుకల్లో ఎండీ షబానా

జఫర్‌గఢ్: మహిళా రిజర్వేషన్‌ను సత్వరమే అమలు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎండీ షబానా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో తమ్మడపల్లి(జి)లో శుక్రవారం రాత్రి నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో సంఘం బాధ్యులు, మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షబానా మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో పాలకులు విఫలమయ్యారని, ఇందుకు మణిపూర్ ఘటనలే నిదర్శనమన్నారు. సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటు మహిళలకు తగిన గౌరవం కల్పించడానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం బతుకమ్మ గొప్పతనంపై మహిళలకు వివరించారు. కార్యక్రమంలో గుండెబోయిన రాజు, చొప్పరి వెంకటమ్మ, నక్క అనూష, గుర్రపు శ్రుతి, రాపర్తి రజిత, రాపర్తి నీలమ్మ, రాపర్తి లక్ష్మి, ఉప్పునూతల ఎల్లమ్మ, పుశమ్మ, ఎల్లమ్మ, సంపూర్ణ, పిచ్చమ్మ, రజిత, శారద, రజినితో పాటు తదితరులు పాల్గొన్నారు.

వీగిన అవిశ్వాసం



డీసీఓ, సూపరింటెండెంట్, అవిశ్వాస తీర్మానానికి హాజరు కాని సభ్యులు

నర్మెట: పీఏసీఎస్ చైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్ రెడ్డిపై సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం శనివారం వీగిపోయింది. రైతులకు అందుబాటులో ఉండడంలేదని, సొసైటీ అభివృద్ధి కుంటుపడిందని, పార్టీ ఫిరాయించాడని అభియోగం మోపుతూ సభ్యులు ఆయనపై గతనెల 29న అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతూ డీసీఓ వై.రాజేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఈనెల 3న స్థానిక పీఏసీఎస్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన అసమ్మతి సభ్యులు 8 మంది డీసీఓకు అవిశ్వాసం కోరుతూ ఆయన ఎదుట సంతకాలు చేశారు. ఈసందర్భంగా శనివారం డీసీఓ, సూపరింటెండెంట్ జి.శంకర్ నాయక్ అవిశ్వాస తీర్మాన సమావేశం ఏర్పాటు చేసి మధ్యాహ్నం వరకు వేచి ఉన్నా సభ్యులు హాజరుకాలేదు. దీంతో అవిశ్వాసం వీగి పోయినట్లు వారు ప్రకటించి సీఈఓ కొన్నె వెంకన్నకు రికార్డులను అప్పగించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

కొడకండ్ల: మండలంలోని మొండ్రాయి ఉన్నత పాఠశాలలో 2005–06 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా విద్య నేర్పిన గురువులను సన్మానించారు. హెచ్‌ఎం యాకూబ్‌పాషా, ఉపేందర్‌రావు, నగేష్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, నర్సింహారెడ్డి, మజీద్, సాగర్ ఉన్నారు.

నాణ్యమైన పత్తి తెచ్చి మద్దతు ధర పొందాలి

స్టేషన్‌ఘన్‌పూర్: రైతులు నాణ్యమైన పత్తిని తీసుకువస్తే ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.7020 సీసీఐ ద్వారా పొందవచ్చని మార్కెట్ కార్యదర్శి జన్ను భాస్కర్ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. సీసీఐకి పత్తి విక్రయించడానికి రైతులు తమ ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోవడంతో పాటు బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు. అనుసంధానం చేసిన ఫోన్‌నంబర్, వాడుకలో ఉన్న బ్యాంకు ఖాతా నంబర్ సక్రమంగా ఉంటేనే సీసీఐ ద్వారా డబ్బులు జమవుతాయని చెప్పారు. పత్తిలో తేమ 8 శాతం ఉంటే క్వింటాకు గరిష్టంగా రూ.7020 కనీస మద్దతు ధర లభిస్తుందని, 8 నుంచి 12శాతం తేమ ఉంటేనే సీసీఐ వారు కొనుగోలు చేస్తారని పేర్కొన్నారు.

గ్రామాభివృద్ధే ధ్యేయం

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తుందని చిన్నరామన్‌చర్ల సర్పంచ్ ఖలీల్‌బేగం ఆజాం అన్నారు. శనివారం గ్రామంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సీడీఎఫ్ ఫండ్‌తో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామంలో అండర్ డ్రెయినేజీలు, మురుగు కాల్వలు, సీసీ రోడ్ల నిర్మాణాలను చేపట్టామన్నారు. గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. మాజీ సర్పంచ్ బాపురెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, నాగరాజురెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్‌రెడ్డి, హరీశ్‌రెడ్డి, యాదయ్య, కిష్టయ్య, బాలయ్య ఉన్నారు.

పెద్దతండాలో క్రికెట్ టోర్నీ



విజేతగా నిలిచిన పెద్దమడూరు టీం సభ్యులు

దేవరుప్పుల: మండలంలోని మాదాపురం రెవెన్యూ పరిధి పెద్దతండాలో బతుకమ్మ, దసరా పర్వదినం పురస్కరించుకొని బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ సౌజన్యంతో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. శనివారం ధర్మాపురం టీంపై పెద్దమడూరు తండా జట్టు విజయం సాధించింది. సర్పంచ్ కోక్యా నాయక్, క్రీడాకారులు జగన్, భాను పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పోలింగ్ కేంద్రం పరిశీలన

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ ఆంజనేయులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్‌ల్లో వసతులపై స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆర్ఐ అనిల్‌బాబుతో పాటు అంగన్‌వాడీ టీచర్లు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

చిల్పూరు: మత్స్యకారుల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ముదిరాజ్ మహాసభ నియోజకవర్గం ఇన్‌చార్జ్ అలుగు అశోక్ అన్నారు. మల్కాపూర్‌లోని వలాద్రి పెద్ద చెరువులో శనివారం రూ.1.40 లక్షల విలువైన చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వచ్చాక చెరువులు నీటితో నిండడమే కాకుండా, ఉచితంగా ప్రభుత్వం చేప పిల్లలను అందివ్వడంతో మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని అన్నారు. సంఘం అధ్యక్షుడు చొప్పరి రాజు, ముప్పిడి కుమార్, అబ్బయ్య, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పరామర్శ



పాలకుర్తి: పలు గ్రామాల్లో వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను మంత్రి దయాకర్‌రావు సతీమణి ఎర్రబెల్లి ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు పరామర్శించారు. శనివారం తిరుమలగిరిలో గోవింద హరికుమార్, శాతపురంలో దుబ్బతండాలో భూక్యా కిసిని కుటుంబ సభ్యులను ఉషాదేవి పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

కాంగ్రెస్‌లో చేరిక

పాలకుర్తి టౌన్: గూడూరు జానకీపురం, వావిలాల, సిరిసన్నగూడెం గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు 100 మంది శనివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవు

చిల్పూరు: దసరా రోజు తాగి గొడవలకు పాల్పడితే ఎంతటి వారైనా చర్యలు తప్పవని ఎస్సై వినయ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని గ్రామాల్లో శనివారం ఎన్నికలు, పండుగలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. సర్పంచ్ రవి, ఉపసర్పంచ్ వంశి, రంజిత్‌రెడ్డి, అశోక్ ఉన్నారు.

బీజేపీ విజయానికి కృషి చేయాలి

పాలకుర్తి టౌన్: అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తి నియోజవర్గంలో బీజేపీ విజయం కోసం కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెద్దగాని సోమయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరికి టికెట్ వచ్చినా అందరూ సమష్టిగా కలిసి పనిచేయాలని కోరారు. శ్రీమాన్, శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్ రెడ్డి, కోటేశ్వర్, నరేందర్, రవిబాబు పాల్గొన్నారు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

జనగామ : 9951602871

Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి — పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

కె. మల్లేష్ (S.R) : 9849921793 (పాలకుర్తి)
యం.డి. ఖలీల్ (S.R) : 8179719313 (జనగామ)
జి. రవియాదవ్ (A.C.O) : 9032782191